విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు

జాతీయ కార్యదర్శి నారా లోకేష్

విశాలాంధ్ర - పాయకరావుపేట: టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రన్న భీమాను రూ.5 లక్షల నుండి ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు లెక్కలు వేసుకొని రూ.10 లక్షలకు పెంచుతామని జాతీయ కార్య దర్శి నారా లోకేష్ ప్రకటించారు. నక్కపల్లి మండలం చిన దొడ్డు గల్లు జంక్షన్ వద్ద మహాశక్తితో లోకేష్ మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రన్న బీమాతోపాటు చాలా పథకాలు రద్దు చేశారని విమర్శించారు. మహిళలు లేనిదే లోకం లేదని, అటువంటి మహిళ ఆనందంగా ఉంటేనే ఇంటిల్లిపాది ఆనందంగా ఉంటారని డ్వాక్రా ప్రవేశ పెట్టిన ఘనత చంద్రబాబు నాయుడుదని అన్నారు. మద్యపాన నిషేదం, 45ఏళ్లకే అన్ని వర్గాల వారికి పింఛన్లు, ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందిని అమ్మఒడి ఇస్తానని అధికారంలోకి వచ్చి వైసీపీ ప్రభుత్వం కోతలు కోశారని విమర్శిం చారు. సీఎం జగన్ కటింగ్, ఫిట్టింగ్ మాస్టర్ అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 100 సంక్షేమ కార్యక్రమాలు కట్ చేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున పంపిణీ, దీపం పథకం కింద 3 సిలిండర్లు ఉచితంగా పంపిణీ, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకాలు మహిళల కోసం అమలు చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా పలువురు మహిళలు వారి సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. తామరానికి చెందిన మహిళ తన కొడుకును హత్య చేశారని, కేసు నీరు కార్చా రని, ఎందుకు హత్య చేశారో కూడా పోలీసులు కనిపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ ఆవేదనను స్పందించిన నారా లోకేష్ పార్టీ నుండి కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, నియోజకవర్గ అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమీషన్ దృష్టికి కోడి కత్తి కేసు

వి.ద.సం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కోడి కత్తి కేసు, దొమ్మేరు దళిత యువకుడి మరణం సంఘటన విషయాన్ని ఎస్సీ కమీషన్ సభ్యుడు సుభాస్ పార్థి దృష్టికి తీసుకువెళ్లినట్లు వి.ద.సం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తెలిపారు. కోడి కత్తి కేసులో దళిత కుటుంబానికీ సహాయం చేస్తామని జాతీయ ఎస్సి కమీషన్ భరోసా ఇచ్చిందని అన్నారు. బొంత మహేంద్ర కుటుంబానికి కమీషన్ అండగా ఉంటుందని చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న సుభాస్ పార్థిని, డైరెక్టర్ సునీల్ కుమార్‌ను మంగళవారం విదసం ఐక్య వేదిక ఆధ్వర్యంలో బొంత మహేంద్ర సోదరుడు బొంత రమేష్, కోడి కత్తి కేసు జనపల్లి శ్రీనివాసరావు సోదరుడు సబ్బ రాజులు హెూటల్ నోవటేల్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కోడి కత్తి కేసులో జైల్లో ఉన్న నిందితుడు జనపల్లి శ్రీనివాసరావు పెట్టుకున్న దరఖాస్తును జైలు అధికారుల అనుమతితో కమీషన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విదసం తుర్పు గోదావరి జిల్లా కన్వీనర్ బొంత శ్యామ్, రవి ప్రకాష్, బొంత బోసుబాబు, బేరి నాగేశ్వరరావు, జనాపల్లి సుబ్బరాజు, బూల భాస్కరరావు, మూర మహేష్, బంటు కృష్ణా రావు, బల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్ -6 గాజువాక నందు మంచి నీటి శుద్ధి కర్మాగారాలకు నీరిందించే ఏలేరు కాలువకు గండి పడటంతో ప్రస్తుతం కాలువ యొక్క మరమ్మత్తు పనులు చేపడుతున్నందున గాజువాక జోన్ -6 పరిధిలో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరాను విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పెదగంట్యాడ, కొంగ పాలెం, వెంకన్నపాలెం, గొడ్డువానిపాలెం, సత్యనారాయణ పురం బానోజి కాలనీ, బానోజీ తోట, సంజీవగిరి కాలనీ, వాంబే కాలనీ, బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, ప్రియదర్శని కాలనీ, గిరిజా కాలనీ, దయాల్ నగర్, నెహ్రూ నగర్, సింహగిరి కాలనీ, సిద్దేశ్వరం, టీజీర్ నగర్, అంబేద్కర్ కాలనీ, వినాయక నగర్, నడుపూరు, హెచ్‌బి కాలనీ, డైరీ కాలనీ, గాంధీ నగర్, సనత్ నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా రోజువిడిచి రోజు వుంటుందన్నారు.

వెల్లంకిలో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి గ్రామపంచా యతీలో మంగళవారం భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివా సరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అభివృద్ధి, సంక్షేమం సచివాలయం పరిధిలో అందించిన వివరాలను అందరికి తెలిసే విధంగా పట్టిక రూపంలో ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా అందించలేని పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు ఫలాల రూపంలో అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, భీమిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సూర్యనారాయణ, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీను, బొట్ట రామకృష్ణ, పిన్నింటి వెంకటరమణ, సత్యం, కాకర వెంకటరమణ, మణిశంకర్ నాయుడు, యర్ర.బంగారు నాయుడు, శినగం దామోదర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ పాదయాత్రలో చిక్కుకున్న ఎమ్మెల్యే కారు

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో నక్కపల్లి మండలం ఉద్దండపురం వద్ద ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. పాదయాత్ర దృష్ట్యా జాతీయ రహదారిపై రాకపోకలు ఒకే వైపు నిర్వహించారు. అయితే ఎమ్మెల్యే కారు మాత్రం పోలీసులు మళ్లించిన దారిలో కాకుండా లోకేష్ పాదయాత్ర చేస్తున్న రోడ్డులో రావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకు పోయింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. చేసేదేంలేక ఎమ్మెల్యే కారును వెనక్కు తిప్పి మిగిలిన వాహనాలు రాకపోకలు చేసే రోడ్డు మార్గంలోనే పంపించారు.

కోలాటం బృందానికి చీరలు వితరణ

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని పెదముషిడి వాడ పంచాయితీ ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి తనయుడు సచివాలయం కన్వినర్ అలమండ నారాయణరావు మరో సారి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. అదే పంచాయితీ శివారు పచ్చిగోరు వానిపాలెం గ్రామానికి చెందిన కోలాటం బృందానికి చీరలు వితరణ చేసారు. తన సొంత నిధులతో సమ కూర్చిన 20 చీరలను బృంద సభ్యులకు మంగళవారం ఆయన చేతుల మీదుగా అందజేసారు. ఈ సంధర్భంగా నారాయణరావు సేవలను పలువురు ప్రసంశించారు.

మేయర్, కమిషనర్ దృష్టికి 79వ వార్డు సమస్యలు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ నగర మేయర్, కమిషనర్‌ను కోరారు. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వార్డు సమస్యలను వినతి పత్రం ద్వారా వారి దృష్టికి తీసుకు వెళ్లారు. వార్డులో వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టి, కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే లంకెలపాలెం 149 సర్వే నెంబరు గల ఇనామ్ భూమిలో అదిత్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించ తలపెట్టిన 810 యూనిట్ల అపార్ట్మెంట్లకు జీవీఎంసీ నుండి ఏ విధమైన అనుమతులు ఇచ్చారో రాతపూర్వకంగా ఆ వివరాలు ఇవ్వాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ సిగ్నల్స్ పూర్తిగా స్తంభించిందని సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సిగ్నల్ లేక మండలంలోని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలకు సరిపడా బ్యాలెన్స్ వేసుకొని గత వారం రోజులుగా సిగ్నల్స్ లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలోని అనంత పద్మనాభ స్వామి దీపోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆర్.అప్పారావు ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ ఆదేశాలు మేరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పద్మనాభం పోలీస్ స్టేషన్ సిఐ సన్యాసినాయుడు హాజరై ప్రారంభించారు. శిబిరం దగ్గర వాటర్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బిపి చెక్ చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 750 మందికి తమ సేవలు అందించినట్లు పద్మనాభం గ్రామీణ వైద్యుల సంఘం తరఫున అధ్యక్షుడు ఆర్.అప్పారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ లందరూ పాల్గొన్నారు.

తనపై వచ్చిన అభియోగాల్లో నిజం లేదు

మాడుగుల ఎంపిపి పెదబాబు

విశాలాంధ్ర - వి. మాడుగుల: తన పై జనసేన నాయకులు చేస్తున్న అభియోగాల్లో ఏ మాత్రం నిజం లేదని మాడుగుల ఎంపిపి పెదబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ మధ్య జరుగుతున్న సంఘటనలలో తనకి ఇటువంటి సంబంధం లేదన్నారు. ఒక మైనర్ బాలికను అల్లరిపెడుతున్న దిమిలి చిన్న అనే యువకుల్ని పిలిచి మాట్లాడడం జరిగిందని, అతని సమాధానం బాగుండకపోవడంతో మందలించడం జరిగిందన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

వీసీల నియామకం ఎప్పుడు..?

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయకు సకాలంలో ఛాన్సలర్ల నియామకం జరపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గతంలో ఉన్నత విద్యాశాఖ అధికారులకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆరు నెలల క్రితం ఉన్నత విద్యాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల వీసీలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ విషయాన్ని ఒకటికి రెండుసార్లు అధికారుల వద్ద ప్రస్తావించారు. ఆ తర్వాత కూడా ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అధికారులను పిలిపించుకొని యూనివర్సిటీలు వీసీల నియామకం సకాలంలో జరిగి తీరావాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. ఆయినప్పటికీ వీసీల నియామక ప్రక్రియ నెలల తరబడి కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు యూనివర్సిటీలు ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీలకు వీసీల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసి ఐదు నెలలు పూర్తికా వచ్చింది. ఐదు యూనివర్సిటీలకి సెర్చ్ కమిటీ సమావేశాలు కూడా పూర్తి కావడం, ప్రతి పాదనలు పంపడం కూడా జరిగింది. ఇది జరిగి 15 రోజులు పూర్తయినప్పటికీ వీసీల నియామక ప్రక్రియ ముందుకు వెళ్లకుండా నిలచిపోయింది. ఈ నేపథ్యంలో సోమవారం భారత ప్రధాని వికసిక్ భారత్ కార్యక్రమంలో భాగంగా విశ్వ విద్యాలయాల వీసీలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ కార్యాలయానికి చేరు కున్న విశ్వ విద్యాలయాల వీసీలతో రాజ్ భవన్‌లో సోమవారం గవర్నర్ భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఐదు యూనివర్సిటీలకు పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్లు లేకపోవడం గమనించిన గవర్నర్ ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. వీసీల నియామకం ఎందుకు ఆలస్యం అయిందని ప్రశ్నించారని సమాచారం. కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం అయిందని, త్వరలోనే నియామక ప్రక్రియ వేగవంతం చేస్తామని ఉన్నత విద్యాశాఖ అధికారులు గవర్నర్‌కి హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ అధికారులు కళ్ళు తెరిచి యూనివర్సిటీలకి వీసీల నియామక ప్రక్రియ వేగవంతం చేస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

సీఎం ఆదేశాల సైతం బేఖాతరు
సెర్చ్ కమిటీ ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆలస్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని స్పష్టం చేశారు. మంగళవారం ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 11 మండలాల ఏటిడబ్ల్యూ ఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బంది, వైద్యాధికారులు సికిల్సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తే ప్రధానో పాధ్యాయులకు సమాచారం అందించి ఏటీడబ్ల్యూ ఓల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసారు. సంక్షేమాధికారులు గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు మృతి చెందితే ప్రభుత్వం నిర్దేశించిన 17 కాలమ్స్ ప్రొఫార్మాలో కచ్చితమైన రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు ప్రతి రోజు ఒక ఆశ్రమ పాఠశాలను సందర్శించి తనిఖీ చేయాలని సూచించారు. ప్రతీ నెలా టూరు డైరీ సమర్పించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలకు టెం డరులో ఖరారు చేసిన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, నిల్వ సరుకులు పంపిస్తే సంబంధిత టెండరుదారునిపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఉపసచాలకులు ఐ.కొండలరావు, 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమా ధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తృతం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా జూనియర్ యూత్ రెడ్ క్రాస్ చైర్మన్ అయిన ఆమె మాట్లాడుతూ జూనియర్, యూత్ రెడ్ క్రాస్ కళాశాలల్లో పాఠశాలల్లో టీంలను ఏర్పాటు చేసి లెక్చరర్లు, టీచర్లను కౌన్సిలర్లుగా నియమించాలని చెప్పారు. ఈ విషయమై డీఈవో, ఆర్ఐఓ, డివిఈవోలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో నిల్వ చేయడం ద్వారా రక్త సేకరణ కార్యక్రమాలు విస్తృతం చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అనంతరం అనకాపల్లి రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ.హేమంత్ జీవితకాల సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సమావేశంలో శాఖ ఏడీ రామజ్యోతి, జిల్లా కోఆర్డినేటర్ ఎం. కోటేశ్వరరావు, రాష్ట్ర మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్.వీరన్, వైస్ చైర్మన్ ఎస్.హిమజ, లైఫ్ మెంబర్ డాక్టర్ టి.దేవరాజు, ఏఎంఏఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్ వై. శ్రీనివాసరావు, ఆర్.సతీష్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదు సరికదా రకరకాల యాప్స్‌తో మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆరోపించింది. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నుండి సమ్మె నిర్వహించారు. స్థానిక అంగన్వాడీ ప్రాజెక్టు ఆఫీసు వద్ద అంగన్వాడీలు భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీల కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్లు కుమారి, ఎం.లక్ష్మి, బి.ఇందిర, ఏ.ఈశ్వ రమ్మ, వరలక్ష్మి, కోమలి, అమ్మాజీ, సీఐటీయూ నాయకులు నాయుడు బాబు, రొంగలి ముత్యాల నాయుడు, ఎర్ర దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: ఆంధ్ర రాష్ట్రంలో అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచి ఇస్తానని చెప్పి మాట తప్పిన వైసీపీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెను అరకులోయలో ప్రారంభించారు. అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాజీలేని



పోరాటం చేస్తున్నారని అందుకు అభినందించా ల్సిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, లబ్ధిదారులకి న్యాయమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. కావాలనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతు న్నాయని అన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సమ్మె పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గా నాగమ్మ, ప్రాజెక్టు కమిటీ నాయకులు, పంగి వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, జానకి, భవాని, సీత, గౌరమ్మ, వంజన తదితరులుపాల్గొన్నారు.

అనంతగిరి: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం చేపట్టిన అంగన్వాడీల సమ్మెలో ఆయన

మాట్లాడారు. ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా కార్యకర్తల చేత వెట్టి చాకిరి పనులు చేయిస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు, సర్పంచ్ కె.మొస్య, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, అంగన్వాడి హెల్పర్ యూనియన్ మండల నాయకురాలు సిఎస్.కళావతి, పి.మంజుల, లక్ష్మి చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంగన్వాడీల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు గిడ్డి మొదకొండమ్మ తెలిపారు. జి.మాడుగులలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు మొదటిరోజు సమ్మెను స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంగన్వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, సింహాచలం, రాజేశ్వరి, వరాలమ్మ, పూర్ణ, కాంతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం రూ.4.80 లక్షలు విరాళం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని కోరుతూ సీఎంఆర్ అధినేత ఎం.వెంకట రమణ రూ.4.80 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జునకు మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ నిధులను అందజేసినట్లు ఎం. వెంకటరమణ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఈ నిధులు ఉపయోగపడాలన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ అధినేతను కలెక్టర్ అభినందిం చారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మరింత మంది వ్యాపారవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వైసీపీ విజయం కోసం పని చేద్దాం

విశాలాంధ్ర - చింతపల్లి: మరోమారు వైసీపీ విజయం కోసం పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా పని చేద్దామని ఆ పార్టీ ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. మండలంలోని అన్నవరం, బెన్నవరం, తమ్మెంగుల, బలపం పంచాయ తీలలోని వైసీపీ నాయకులు, కార్య కర్తలతో ఆయన సమా వేశమై మాట్లాడారు. గడచిన నాలుగున్నరేళ్లలో వైసీపీ ప్రభు త్వం చేసిన అభివృద్ధి అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంద్రు చిన్నాబ్బాయి, బెన్న వరం సచివాలయం కన్వీనర్ బచ్చలి బొజ్జన దొర, కొట్టకి రాధాక్రిష్ణ నాయకులు సిరిమా పండన్న, అన్నవరం గృహ కన్వీనర్ కొర్ర భగత్, చంటి కార్యకర్తలు పాల్గొన్నారు

ఎంపీడీఓ డా. జానకి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం ఎంపీ డీవోగా డాక్టర్ వి.జానకి బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 11, 12 తేదీలలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మండలాల్లో జరిగే కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న ఇల్లు స్థలాల నిర్మాణాలు, గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామాలలో అభివృద్ధికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా కలవ వచ్చునని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు వాసు రాజును మర్యాద పూర్వకంగా కలిశారు.

నేటి నుండి అధ్యయన ఉత్సవాలు



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 13 నుండి 2024 జనవరి 15వ తేదీ వరకు అధ్యయన ఉత్సవాలు జరగను న్నాయి. సింహగిరిపై నిర్వహించే అధ్యయనోత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. వైకుంఠ ఏకాదశికి ముందు పగల్ పత్తు 10 రోజులు అంటే నేటి నుండి 22వ తేదీ వరకు, తరువాత 10 రోజులు రాపత్తు అంటే 23వ తేదీ నుండి 2024 జనవరి 2వ తేదీ వరకు, పిదప 11 నుండి 15వ తేదీ వరకు దారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు.

క్రీడా ప్రోత్సాహానికే ఆడుదాం ఆంధ్రా



విశాలాంధ్ర - కె.కోటపాడు: క్రీడల్లో ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి ప్రోత్సాహం అందజేసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఇప్పటికే సచివాలయాల పరిధిలో ఉత్సాహంగా యువకులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సాంకేతిక సహాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న



విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్ర మాన్ని ఇక్కడి మండలంలోని కురిడి కొర్రాయి పంచాయతీ సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతుల మీదు గా సచివాలయంలోని బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రమిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, వైసీపీ మండల సీనియర్ నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం నుండి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13వ తేది ఉదయం 08.01గం.లకు విశాఖపట్నం దక్షిణ నియోజక వర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. నేటి నుండి వచ్చే నెల 11వ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర ప్రాంతాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. వికలాంగులు, చంటి పిల్లల తల్లుల కొరకు కొత్త రోడ్డు జంక్షన్ నుండి ఉచిత ఆటో ఏర్పాటుతో పాటు గాజువాక, సింహాచలం, మధురవాడ ప్రాంతాల నుండి భక్తుల కోసం ఉచిత బస్సులను ఆర్.టి.సి ఏర్పాటు చేసింది. ఈ నెల 31న సాయంత్రం 06.00గం.ల నుండి వేద సభ, అర్చక సదస్సు, జనవరి 2న సాయంత్రం 04.00 గం.లకు నాదస్వర కచేరి, 6వ తేదీ మధ్యాహ్నం అమ్మవారి మాలధారణ చేసిన భక్తులతో అంబికా బాగ్ రామాలయం నుండి అమ్మవారి ఆలయం వరకు రథయాత్ర సాగనుంది.

వైభవంగా అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన అనంత పద్మనాభస్వామి దీపోత్సవానికి లక్షలాదిగా భక్తులు పోటెత్తారు. పద్మనాభ పుణ్యక్షేత్రానికి చేరుకుని 1286 కొండమెట్ల పంక్తి పై అత్యంత భక్తి శ్రద్ధలతో తైల దీపాలు వెలిగించి ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. వేద పండితులు నిర్ణయించిన సుముహూర్తంలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ అనంతపద్మనాభ స్వామి వారి ఉత్సవమూర్తులను కొండ దిగువున ఉన్న శ్రీ కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి గరుడ వాహనంపై మేళ తాళాలతో ఊరేగింపు చేసి గిరిమెట్ల మార్గంలో తొలి పావంచ వద్దకు చేర్చారు. ప్రత్యేక మండపంలో ప్రతిష్టించిన స్వామి వారి ఉత్సవ మూర్తులకు పూజా అధికారులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఎమ్మెల్యే అవంతి, ప్రముఖులు దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదం, తాగునీరు, శీతల పానీయాలు పంపిణీ చేశాయి. భక్తులకు దేవాదాయ, రెవిన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య, రవాణా, అగ్నిమాపక, విద్యుత్తు, తదితర శాఖల అధికారులు అంకిత భావంతో సేవలు అందించి భక్తుల మన్ననలు పొందారు.

అన్ని వ్యాధులకు మందు నవ్వు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ రచయిత డా. చల్లా కృష్ణవీర్ అభిషేక్ రచించిన "స్వచ్ఛమైన నవ్వు" పుస్తకాన్ని ప్రముఖ అవార్డు-విజేత నటుడు మరియు రచయిత ఎల్‌బి శ్రీరామ్ ఈరోజు ఇక్కడ ఆల్ ఇండియా రేడియోలో ఆవిష్కరించారు. "స్వచ్ఛమైన నవ్వు" అనేది విశిష్ట సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, లాఫ్టర్ యోగా యొక్క ప్రమోటర్ అయిన డా. చల్లా కృష్ణవీర్ అభిషేక్ రచించిన, చమత్కారంతో తెలివైన కథనాలను మిళితం చేస్తూ, హాస్యం యొక్క ఆకర్షణీయమైన అన్వేషణ. ఈ పుస్తకం పాఠకులకు నవ్వుల ప్రపంచంలోకి ఆకర్షణీయమైన ప్రయాణాన్ని వాగ్దానం చేస్తుంది, జీవితంలోని తేలికైన క్షణాలపై ప్రత్యేకమైన దృక్పథాన్ని అందిస్తుంది. హాస్యాస్పదమైన కంటెంట్‌కు తన అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, డా. చల్లా కృష్ణవీర్ అభిషేక్ సాహిత్య నైపుణ్యాన్ని ప్రశంసించారు. డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ మన జీవితంలో నవ్వు యొక్క ప్రాముఖ్యతను పుస్తకం వెనుక ఉన్న స్ఫూర్తిని నొక్కిచెప్పిన అద్భుతమైన స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రోగ్రాం హెడ్ బి.ఆర్.ఎస్.ప్రకాశరావు, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

విశాఖ పశ్చిమ క్రికెట్ లీగ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న యువకుల కోరిక మేరకు విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్‌ను నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్సిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం ఉడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో క్రికెట్ లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 21న ప్రారంభమయ్యే ఈ లీగ్ మ్యాచ్‌లు జనవరి 7వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజవర్గ పరిధిలోని జింక్ గ్రౌండ్ , షిప్ యార్డ్ గ్రౌండ్ , చంద్ర నగర్ గ్రౌండ్స్‌లో అన్ని మ్యాచ్‌లు జరుగుతాయని అన్నారు. విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ నకు సంబంధించి మరింత సమాచారం కొరకు ఫోన్ నంబర్లు : 90008 18467, 90009 38467 సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వం సలహాదారు(స్కిల్ డెవలప్మెంట్ జాబ్ పేర్స్) మిలీనియం శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అరకులోయ: మండలంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని ఐదుగురు గిరిజన పేద విద్యార్థినులను అరకులోయ పాంగి శ్యామ్ గణేష్ మెడికల్ షాప్ యాజమని 26 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.మారుమూల గ్రామాలకు చెందిన కొర్ర రాణి, పూజారి వెంకట లక్ష్మీ, కిముడు శాంతి,కొర్ర అంకరి,బిడ్డ శైలజ, లకు పరీక్ష ఫీజ్ చెల్లించుటకు అర్థికంగ ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న పాంగి శ్యామ్ గణేష్ మెడికల్ యజమాని గణేష్ ఒక్కొక్క విద్యార్థినులకు 5,000 చొప్పున మొత్తం ఇరవై ఆరు వేలు రూపాయిలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత చదువులకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.వారికీ భవిష్యత్తులో కూడా ఇంకేదైనా అవసరం వచ్చినా తననీ సంప్రదించాలనీ శ్యాం గణేష్ విద్యార్థినులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా ,రామ కృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా,భరత్ కుమార్ నాయక్,వైస్ ప్రిన్సిపాల్ పి చలపతి రావు,కొర్ర వెంకట్,వీఆర్వో చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: వెస్ట్ బెంగాల్ చెందిన రవి భూమిజీ (28) అనే వ్యక్తి మండలంలోని వెంకటనగరం గ్రామం వద్ద చెట్టుకి ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డెక్కన్ కెమికల్స్ పరిశ్రమకు చెందిన హరిహరన్ కంపెనీలో కార్పెంటర్ గా పనిచేస్తున్న రవి భూమిజీ కి ఏడాది క్రితం వివాహం అయింది. మద్యానికి అలవాటు పడటంతో భార్య ఇటీవల పుట్టింటికి వెళ్ళింది. దీంతో మనస్థాపానికి చెందిన భూమిజీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు తమ్ముడు కభీ భూమిజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేంకటాద్రిపై అఖండ దీపోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: శివ కేశవులు ఇద్దరూ నెలకొని వున్న వేంకటాద్రి క్షేత్రంలో అఖండ దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజైన అమావాస్య నాడు విజ్ఞాన జ్యోతులు పంచుతూ ప్రతీ ఏటలాగే సాయింత్రం 6 గంటలకు కొండ శిఖరం నుండి, కిందన వున్న మెయిన్ రోడ్డు వరకూ లక్ష దీపాలు వెలిగించారు. దీంతో వెంకటాద్రి దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలు గొందింది. ఆలయ ప్రధాన అర్చకులు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈవో నీలిమ, ఆలయ ధర్మకర్త ఎమ్మెస్ రాజు దీపోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరిపొలాల పరిశీలన

విశాలాంధ్ర - ఎటపాక: ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆదేశాల మేరకు ఎటపాక మండలంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి మిర్చి వేసిన రైతుల యొక్క పొలాలను గుండాల సచివాలయ ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. వరి, మిర్చి, రైతులకువర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు సంబంధించిన వివరాలన్నీ సేకరించారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతుకు నష్టపరిహారం అందుతుం దన్నారు. కార్యక్రమంలో గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ తోట శశి కుమార్, సచివాలయ కన్వీనర్లు కాకాని సురేష్, ముత్తి బోయిన రాము, అగ్రికల్చరల్ అసిస్టెంట్ లక్ష్మణ్, రైతు సోదరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర - హుకుంపేట: ఏకలవ్య పాఠశాల త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం కమిటీ జాయింట్ కమీషనర్ బిపిన్ చంద్ర రతుని పేర్కొన్నారు. మండలంలో మట్టజోరు పంచాయతీ నక్క లపుట్టు గ్రామంలో ఏకలవ్య పాఠశా ల నిర్మాంచేందుకు స్థానిక తహశీల్దార్ రాజ్యలక్ష్మి కమిటీ సభ్యులతో జాయింట్ కమీషనర్, ఎన్ఐ ఎస్టీ ఈ ఎం ఆర్ బృంధ సభ్యులు కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాల నిర్మాంచేందుకు గ్రామస్తులు ముందు కొచ్చి స్థలాన్ని స్వచ్ఛందగా దానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన కళా ఉత్సవ్

విశాలాంధ్ర - భీమిలి: జిల్లా విద్యా శిక్షణ సంస్థలు రెండు రోజులపాటు జరిగిన కళా ఉత్సవ కార్యక్రమాలు నేటితో ముగిసాయి. మంగళవారం నాలుగు కేటగిరీలలో జరిగిన పోటీలలో 10 పాఠశాలల నుండి 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీత గాత్రం, జానపద సంగీత గాత్రం, ఏకపాత్రాభినయాలు, సంప్రదాయ బొమ్మల తయారీ మొదలగు అంశాలలో పోటీలు జరిగాయి. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భీమునిపట్నం నందలి పిఎస్ఎమ్ ఉన్నత పాఠశాల, నక్కపల్లి నందలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాల, దేవరపల్లి మండలం నందలి కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాలలో నిలిచారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ గొట్టేటి రవి బహుమతి ప్రధానం చేశారు. వీరు బుధవారం బయలుదేరి విజయవాడలో 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణీతలుగా డిఎన్ మూర్తి, రత్నంలు న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ త్రినాధరావు, ఎం మహాలక్ష్మి, పి హరిణి, సిపి సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు నేతలు

విశాలాంధ్ర - కోటవురట్ల: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర జిల్లాలో కొనసాగుతున్నందున పాదయాత్రలో పాల్గొనడానికి మండలంలో గల తెదేపా జనసేన నాయకులు మంగళ మంగళవారం బయలుదేరి నక్కపల్లి వెళ్లారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రలో పాల్గొని ఆయనకు సంపూర్ణ మద్దతు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా జనసేన కూటమి విజయ దంకా మోగించడం ఖాయమని వారి స్పష్టం చేశారు. పాదయాత్రలకు తరలి వెళ్ళిన వారిలో తెదేపా నాయకులు వీవీ సూర్యరావు, కసిరెడ్డి ఏసు, తంగేటి శ్రీను, నాగేశ్వరరావు, జనసేన నాయకులు బద్రి, పవన్, తెదేపా జనసేన కార్యకర్తలు ఉన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పాదయాత్ర

విశాలాంధ్ర - పాయకరావుపేట: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పాయకరావుపేట నియోజకవర్గంలో రెండో రోజు నాయకులు, కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం తీసుకొచ్చింది. మొదటి రోజు పాయకరావుపేట పట్టణంలో నిర్వహించిన పాదయాత్ర అనంతరం రాత్రి మండలంలోని నామవరం సమీపంలోని వైభవ్ లేఅవుట్‌లో నారా లోకేష్ బస చేశారు. మంగళవారం ఉదయం నామవరం నుండి ప్రారంభమైన పాదయాత్ర నక్కపల్లి మండలం దేవవరం, ఒడ్డిమెట్ట, గొడిచెర్ల, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు జంక్షన్ల మీదుగా నక్కపల్లి చేరుకొని అక్కడ నుండి అడ్డరోడ్డు సమీపంలోని క్రిష్ లేవుట్ వరకు కొనసాగింది. పాదయాత్ర అంతా నారా లోకేష్‌కు మహిళలు బ్రహ్మరథం పట్టారు. నామవరం గ్రామం వద్ద తమలపాకు దండతో నారా లోకేష్‌ను సత్కరించారు. సమస్యలు పరిష్కరించాలని పీఎసిఎస్ ఉద్యోగులు, రైతాంగం సమస్యలు పరిష్కరించాలని పెదిరెడ్డి శ్రీరాములు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి, చేతి వృత్తి లేని మాల కులస్తులకు ఉపాధి కల్పించాలని వార గాంధీ తదితరులు నారా లోకేషకు వినతిపత్రాలు అందజేశారు. పాదయాత్రలో టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చింతకాయల విజయ్, బైరా దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వ మతాలకు చేయూతనిస్తున్న ఎంవీఆర్

కుంచా వారి గైరమ్మకు 1,50,000
చోడవరంలోని చర్చికి 15000
దేవరాపల్లిలోని చర్చికి 15000

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కుంచా వారి గౌరీ పరమేశ్వరుల వారంటే తనకెంతో ఇష్టమని ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) పేర్కొన్నారు. ఈ నెలలో నిర్వహించబోవు స్వామివారి అనుపు మహోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు సోమ వారం పట్టణంలోని నరసింగరావుపేటలోని ఎం.వి .ఆర్ ప్రధాన కార్యాలయము నకు విచ్చే శారు. దీనిలో భాగంగా ఎంవిఆర్‌ను కలిసి ఆహ్వానం పత్రికను అందించారు. ఈ మేరకు స్వామివారికి 1,50,000 రూపాయల బ్యాంక్ చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు, ఎం వి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వంలోని మానవాళికి క్రీస్తు యొక్క సందేశం శాంతి మార్గాన్ని చూపిస్తుందని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం పట్టణంలోని నర్సింగరావుపేట లోని ఆయన ప్రధాన కార్యాలయం నందు, జిల్లాలోని చోడవరం, దేవరాపల్లి నందు ఉండే చర్చ్ సోదరులతో మాటామంతీ ఆడి, ఒక్కొకరిని పరిచయం చేసుకున్నారు. ఈనెలలో జరగబోవు క్రిస్మస్ వేడుకలకు తన వంతు సహాయంగా చెరో 15 వేల రూపాయలను ఆ క్రైస్తవ సోదరులకు విరాళంగా ఎంవిఆర్ తన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ మాట్లాడుతూ సేవా గుణంతోనే మనమందరం జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులతో పాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు, సంజూ బాబు టీం సభ్యులు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేము ఎప్పటికీ విధేయులమే!

విశాలాంధ్ర - గాజువాక: ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ వైవీ సుబ్బారెడ్డిని అయన నివాసంలో మంగళవారం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఇంచార్జి దేవన్ రెడ్డి కలిశారు. దేవన్ రెడ్డి రాజీనామా దుమారం చల్లారక ముందే ఈ పరిణామం ఊహకు అందని ట్విస్ట్! ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ నేను గాని, నా కుమారులు కానీ ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నమ్మకస్తులుగా ఉంటున్నాం, ఉంటాం అంటూ రాజీనామా ఎపిసోడ్ కు తెర దించారు. పార్టీకి విధేయులుగా ఉంటాం. జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీ శ్రేయస్సు కోసం కంకణబద్ధులై పనిచేస్తామని స్పష్టం చేసారు. జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలి, అదే మాకు ముఖ్యం అన్నారు. అలానే దేవన్ రెడ్డి మాట్లాడుతూ నిన్న నేను నా వ్యక్తిగత పనులు మీద బయటకి వెళ్ళాను. వెళ్లేముందు మా ఇంచార్జి సుబ్బారెడ్డితో మాట్లాడి వెళ్ళాను. అక్కడ ఫోన్ సిగ్నల్స్ లేవు. నిన్న నేను మళ్ళీ సిటీ కి వచ్చే లోపు నామీద చాలా పుకార్లు విని విస్తు పోయాను. అయినా మా నాన్నగారు ఎమ్మెల్యే గా ఉండగా నేనెందుకు పార్టీకి రాజీనామా చేస్తాను. నేను పార్టీతోనే వున్నాను అని చెప్పి మా పెద్దలు సుబ్బారెడ్డి గారికి వివరణ ఇచ్చేందుకే నేను, మా నాన్న వచ్చాము. మేము ఎప్పటికి ముఖ్యమంత్రి జగన్ గారి మాటకి, పార్టీకి కట్టుబడి ఉంటాము. పార్టీ నిర్ణయాన్ని శిరసా వహిస్తాము అంటూ వివరణ ఇవ్వడం నిన్నటి రాజీనామా ఎపిసోడ్ కు కొసమెరుపు!

నిరవధిక సమ్మెకు దిగిన పోస్టల్ ఉద్యోగులు

విశాలాంధ్ర - చోడవరం: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తపాల ఉద్యోగుల సమస్యల సాధనకు ఏ.ఐ.టీ.యూ.సీ. మద్దతుతో తపాలా ఉద్యోగులు మంగళ వారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాల ఉద్యోగులు తలపెట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ ఉమ్మడి విశాఖ జిల్లా సమితి కార్యదర్శి కోన లక్ష్మణ్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. చోడవరం పోస్ట్ ఆఫీస్ వద్ద జరిపిన సమ్మె లో పాల్గొన్న కోన లక్ష్మణ్ మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని, గ్రామీణ డాక్ సేవకులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, ఏడో వేతన కమిటీలో అమలుకు నోచుకోని అన్ని డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో తంతి తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజనల్ కార్యదర్శి వి. దుర్గా ప్రకాష్, నాయకులు స్వామి రాజు సత్తిబాబు అప్పారావు, స్థానిక ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, గుమ్మాల పరమేశ్వరరావు, సి.పి.ఐ చోడవరం ఏరియా కార్యదర్శి నేమాలహరి, ఆదిత్య, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలినేని మామకు వేల కోట్ల బల్లికురువ గ్రానైట్ కొండ ధారాదత్తం



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మంత్రిగా బాలినేని శ్రీనివాస్ రెడ్డి చేసిన అవినీతిలో వరుసకు అల్లుడైన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాత్ర ఉందని విశ్వసిస్తున్నాం అని, ఆ కారణంగానే బాలినేని అక్రమాలు, అవినీతిపై విచారణకు ఆదేశించలేదని జనసేన కార్పొరేటర్ పీతలు మూర్తి యాదవ్ ఆరోపించారు. మంగళవారం పౌర గ్రంధాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మూల సర్పంచ్ స్థాయి వ్యక్తి అవినీతికి పాల్పడిన పసిగట్టే ముఖ్యమంత్రి -బాలినేని వేలకోట్ల సంపాదనకు సహకారం అందించారని బాలినేని అక్రమాలు అన్నీ వెలుగులోకి వచ్చినప్పటికీ స్వయంగా ఆయనే అవినీతికి పాల్పడినట్లు ప్రకటించినప్పటికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోకుండా వెనకేసుకు రావడం దారుణం అన్నారు. బాలినేని శ్రీనివాస్ రెడ్డిని వెనకేసుకు రావటమే కాక వేల కోట్ల రూపాయల విలువచేసే బాపట్ల జిల్లా బల్లికురవలోని సర్వేనెంబర్ 1067,1098, 1100,1101, 1102, 1103,1198, 1234,1235,1236,1237 లోకంలోని 500 ఎకరాల బ్లాక్ గ్రానైట్ కొండను బాలినేని బినామీలకు ముఖ్యమంత్రి అప్పగించటం అవినీతిని ప్రోత్సహించటమేనన్నారు. బాలినేని బినామీలైన వియ్యంకుడు భాస్కర్ రెడ్డి కుమారుడు కుండా సాయి కళ్యాణ్ రెడ్డి , భాస్కర్ రెడ్డి దగ్గర గుమస్తాగా పని చేసే సిరికి రెడ్డి బ్రహ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి బంధువైన కుండా రాజ కిషోర్ రెడ్డి, ఊరిబిండి కృష్ణ కిషోర్ రెడ్డి తదితరుల పేరిట రామిరెడ్డి మినరల్స్, పురుహితిక మినరల్స్, ఎస్ ఎల్ ఎన్ మినరల్స్, శ్రీమాతా గ్రానైట్స్, సిద్ధన్ గ్రానైట్స్ కంపెనీల ద్వారా 500 ఎకరాలకు పైగా ఉన్న బల్లికురవ కొండలు మొత్తం బాలినేని తన కబంధ హస్తాల్లో పెట్టుకున్నారన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - ఎటపాక : ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి పెన్షన్‌తోపాటు అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తపాలా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం ఎటపాక మండలం నెల్లిపాక లో నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు చోడవరం విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం: ఏ.పి. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో చోడవరం విద్యార్థులు విజయం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికైనట్లు యోగా గురువు పుల్లేటి సతీష్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఆర్టిస్టిక్ సోలో యోగ జూనియర్స్ 14 నుండి 18 సం.ల విభాగంలో పొట్నూరు పవన్ కుమార్ ప్రథమ స్థానం సాధించగా, ట్రెడిషనల్ యోగ 18 నుండి 28 సం.లు సీనియర్ బాలుర విభాగంలో కొట్టాపు హరి కిరణ్ మూడవ స్థానం సాధించారాన్నరు. విజేతలైన విద్యార్థులను యోగ కేంద్రం అధ్యక్షులు పసుమర్తి అశోక్, కోచ్ బోగవిల్లి గణేష్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ అభినందించారు.

జన సైనికుల ఆందోళన

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా బుచ్చయ్య పేట మండలం వడ్డాది జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అనుమతులు లేకుండా అధికార మదంతో వై.సి.పి. మంగళవారం నిర్వహిస్తున్న బి.సి. సాధికారత బస్సు యాత్రపై జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో జనసైనికులు చోడవరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. జనసేనాని రాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా బుచ్చయ్య పేట మండలం వడ్డాది ఎస్.కె.ఏ.డి. జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సాధికార సదస్సు ఎలా నిర్వహిస్తారు అని ప్రశ్నించారు. విద్యార్థుల చదువు సంధ్యలు పాడు చేసే రాజకీయ సదస్సులు విద్యాలయాల్లో నిర్వహించడం అమానుష చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో గూనూరు మూలునాయుడు, సిరిపురపు రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోమన్ కాథలిక్ మిషన్ ఆలయ పునరుద్ధరణ

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం నెల్లిపాక రోమన్ కాథలిక్ మిషన్ ఆలయ పునరుద్ధరణ వేడుకలను రెవ. ఫాదర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇటలీ దేశపు ఆర్ బోర్ సమస్త అధినేత డిగో శ్యామ్ విచ్చేసి మందిర నిర్మాణం జరిగిన నాటి నుండి నేటి వరకు జరిగిన విషయాలను సంఘస్తులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టెల్లా మెరిసి, పాఠశాల ఉపాధ్యాయులు, గుడి పంతులు తుంగా ప్రసాదు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో జనతా మహిళా సేవా సంఘం

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు, జనతా కాలనీలో జనతా మహిళా సేవా సంఘం 20వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. నందవరపు సోములు, జనతా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం. విమల ప్రసంగిస్తూ 20 సంవత్సరాల క్రితం నందవరపు ప్రారంభించిన జనతా మహిళా సేవా సంఘం జనతా కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించుటలో ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమానికి బలివాడ రమకుమారి, బొజ్జ వెంకట లక్ష్మి భారతి, దాసరి శివలక్ష్మి జ్యోతిప్రద, సత్యవతి, అరుణకుమారి హాజరయ్యారు.

14న జనసేన, టీడీపీ మహాధర్నా

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఇటీవల సాయికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ, జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు ఆయన నేతృత్వంలో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పీవిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు సహకారంతో మాడుగుల మండల అధ్యక్షులు రొబ్బా మహేష్‌తో మాడుగులలో భారీ దర్నా నిర్వహించనున్నారు.

8వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వై నీడ్స్ ఏపీ జగన్ పోగ్రాంలో భాగంగా జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో గల వివేకానంద పార్క్ 90వ సచివాలయం దగ్గర వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి ఆధర్యంలో వైస్సార్సీపీ జెండా ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైసీపీ సీనియర్ నాయకులు ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వర్‌రావు, దువ్వి వాసు, పవన్, రాజా రామ్మోహన్, చక్రపాణి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - పెందుర్తి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బిజెపి పెందుర్తి నియోజక వర్గం కన్వీనర్ గొర్లే రామునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 96 వార్డులో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 510 సచివాలయం దగ్గర 300 వీక్షకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై స్క్రీన్ డిస్ప్లేద్వారా సమగ్ర వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో జోన్- 8 జెడ్ సి ఎం.ఎం.నాయుడు, బిజెపి మండల అధ్యక్షులు జై రాజు, వార్డు అధ్యక్షులు కాళ్ళ జగన్మోహన్, నియోజకవర్గ విస్తారక్ అప్పారావు, హెల్త్ డిపార్ట్మెంట్ పిఓ, గొర్లే వరలక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు, ఆర్పీలు, హెల్త్ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, మెడికల్ డిపార్ట్మెంట్, జోన్ 8 ఏపీ డి శ్రీరామ్ స్థానిక నాయకులు ఉమ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసమారాధన

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండల కేంద్రంలోని శబరి ఒడ్డున కొలువై ఉన్న శ్రీ పార్వతీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం కార్తీక మాసం చివరి రోజు అన్నదాన సమారాధన, ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారని అర్చకులు కలగా వరప్రసాద్ శర్మ తెలిపారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

నష్టపోయిన రైతాంగానికి తక్షణమే పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్‌లో మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణమే పరిహారం చెల్లించాలని సిపిఐ మావోయిస్టు పార్టీ విశాఖ అల్లూరి అనకాపల్లి వి ఏ ఏ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ రైతాంగంపై విరుచ కపడిందని, తుఫాను ప్రభావంతో లక్షలాది ఎకరాలలోపంట నీట మునిగిపోవడంతో వేలకోట్ల రూపాయలు రైతాంగం నష్టపోయారని వేలాది రూపాయల అప్పు చేసి పెట్టుబడి పెట్టివరి, మొక్కజొన్న, మినుములు, రాజ్మా, రాగులు, పెసర, వేరుశనగ, ప్రత్తి, మిరప, బొప్పాయి, అరటి, పామాయిల్,కూరగాయలు తదితర పంటలు వేసినప్పటికీ తుఫాన్ మూలంగా సర్వస్వం కోల్పోయి అన్నదాతకు శోకాన్ని మిగిల్చిందన్నారు. ఈతుఫాన్ మూలంగా వందలాది పూరి గుడిసెలు నేలమట్టం కావడం, చేపల వేటనే తమ జీవనాధారంగా చేసుకున్నమత్స్యకారులకు సంబంధించిన వందలాది పడవలు, వలలు పూర్తిగా ధ్వంసం కావడం, వరద నీటిలో కొట్టుకుపోవడంతో నేడు వాళ్ళ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. కూలీ పనులనే జీవనాధారంగా చేసుకున్న వ్యవసాయ కూలీలకు జీవనోపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ పై విషయాలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చే విధంగా ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సహజ ఔషధ మొక్కలు పెంచండి

విశాలాంధ్ర - చింతూరు: ఔషధ మూలికా విజ్ఞాన సదస్సు. పారంపర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా.. మునగపాకలోని రాహుల్ గాంధీ కళ్యాణ మండపం నందు 11, 12 తేదీల్లో రెండురోజులపాటు జరిగింది. ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలలోని ఆయుర్వేద ప్రకృతి మరియు సాంప్రదాయ వైద్యులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కు చెందిన ప్రముఖ ఆయుర్వేద వనమూలికా వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక, ప్రాథమిక ఆరోగ్య రక్షణ సహజ పద్ధతిలో వ్యాధిని నయము చేసుకోనే పద్ధతుల పై అవగాహన కల్పించారు. వ్యాధి ఔషధముతో కంటే ఆహారపు అలవాటులతోనే తగ్గుతుందని వ్యాధినిరోధక శక్తి లేనిదే ఏ ఔషధము పనిచేయదని తెలియజేశారు. ఈ సదస్సులో అనేక రకాల మొక్కలను వసుదేక వనం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనమూలికా వైద్యులు పరంపర్య వైద్య మహాసంఘం అధ్యక్షులు, శల్య వైద్యులు చంద్రశేఖర్ రాజు, అలుగోలు ప్రసాదరావు, ఎస్.కె.సుబానీ, మునగపాక, అల్లక రాజు అనకాపల్లి, ప్రసాద్, తోటడ, పెంచలయ్య, ఎస్.కే. వల్లి తదితరులు పాల్గొన్నారు.

ఏ.పి. భూ హక్కుల చట్టం 27/2023 తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - చోడవరం: ప్రజలకు, ఆస్తులకు భద్రత లేని ఏ.పి. భూ హక్కుల చట్టం 27/2023 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చోడవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆమె మాట్లాడుతూ యాక్ట్ 27/2023 కారణంగా బినామిల పెత్తనంతో ప్రజలు తమ యాజమాన్య హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నిరక్షరాస్యులైన చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతాంగం భూ హక్కుల చట్టం తో మోసపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు, సీనియర్ న్యాయవాది చెల్లూరి కృష్ణ మూర్తి, గూనూరు లక్ష్మీ నారాయణ, మాజీ ఏ.పి.పి. లు అల్లు గిరిధర్, కందర్ప స్వామి, కొల్లి శ్రీను, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మిచౌంగ్ తుఫాను బాధితులకు పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - అరకులోయ :టిడిపి పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అరకులోయ నియోజకవర్గంలో మిచౌంగ్ తుఫాను పంట నష్టం అంచనా వేయట కొరకు నియోజకవర్గంలో తెలుగుదేశం పరిశీలకులు గిరిజన ప్రాంతంలో పంట నష్టం అంచనా వేయటానికి చంద్రశేఖర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పర్యటించారు. అనంతగిరి మండలం కొండిభా పంచాయితీ సింగర్బ గ్రామంలో వరి సొల్లు, రాజ్మా పంటలు నష్టం జరిగినట్లు వారు తెలిపారు, కొర్రాయి పంచాయతీలో సోలు పంటలు తీవ్రంగా నష్టపోయిన టిడిపి అంచనా కమిటీ నిర్ధారించారు, గిరిజన ప్రాంతంలో అరకులోయ నియోజకవర్గంలో పంట నష్టం ఇప్పటివరకు ప్రభుత్వం అంచనా వేయలేదని వారు తీవ్రంగా మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో అరకులో నియోజకవర్గంలో తుపాను పంట నష్టం తక్షణమే గిరిజన రైతులకు అందించాలని వారు డిమాండ్ చేశారు, వరి పంట 25000, సొల్లు పంటకు 20,000, రాజమ పంటకు 20 వేల రూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు అనంతగిరి మండలంలో తుపాను కారణంగా సుమారు మూడు పంచాయతీలలో ఒక్కొక్క రైతులకు 35 వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టిన డబ్బులు నష్టపోయామని వారు తెలిపారన్నారు, ప్రభుత్వం ఇప్పటివరకు పంట నష్టం అంచనా వేయటానికి అధికారులు రైతుల వద్దకు రాలేదని వారు తీవ్రంగా మండిపడ్డారు తుఫాను కారణంగా అనంతగిరి మండలంలో చనిపోయిన గిరిజన మహిళలకు రక్షణ సాయంగా పరిహారం అందించాలని ఇప్పటివరకు ఒక మృతదేహం వెలికతీయుటలో ప్రభుత్వం నిర్లక్ష్యం వాయిస్తున్నారని, గిరిజనులకు చిన్న చూపుతో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి దొన్ను దోర్ర మండిపడ్డారు, గిరిజన రైతుల పంట నష్టాన్ని తక్షణమే పంట నష్టమంచన వేసి రైతులకు తక్షణ సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం టిడిపి ఇంఛార్జి సివేరి దొన్ను , సర్పంచ్ పెట్టేల దాసు బాబు, ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువతకు కెరియర్ గైడెన్స్, వ్యక్తిగత వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించి నట్లుకళాశాల ప్రిన్సిపల్ ఎన్. ఈ. ఫ్లోరా తెలియజేశారు. యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు పర్సనాలిటీ డెవలప్మెంట్ కెరియర్ కౌన్సిలింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎస్.ఏ రవిబాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువత ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కొరకు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు. ఈ క్రమంలో ఉన్నత అవకాశాలు పొందాలని అందుకు ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. నైపుణ్యం గల మానవ వనరుల కొరత ఉందని అయితే ఉద్యోగానికి కావలసిన విద్యార్హతలు ఉన్న ఇంటర్వ్యూలలో సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఒత్తిడికి గురవుతూ ఉద్యోగాలను పొందలేక పోతున్నారని, చదువుతోపాటు నైపుణ్యం పెంపొందించే కోర్సులు కూడా నేర్చుకోవాలని ఉద్బోధించారు తద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు పొందగలరని సదస్సులో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ సిబ్బంది తరఫున బి సూర్యప్రకాశ్రావు డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎం ఎస్ వి సన్యాసిరావు, సూపరిండెంట్, ఎస్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు. 200 మందికి పైగా ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ అవగాహన సదస్సు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.ఆదర్శ్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు, ఏడికె రాజు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టీ. థియోపిలస్ వ్యక్తిగత వికాసం, కెరియర్ డెవలప్మెంట్ ఆంధ్రప్రదేశ్ యువజన శాఖ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ వ్యక్తిగత వికాసం కెరియర్ డెవలప్మెంట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.

బాలింత సంరక్షణపై ఆశా వర్కర్లు దృష్టిసారించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: బాలింతల సంరక్షణలో ఆశాలదే కీలక పాత్ర అని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ గంగునాయుడు అన్నారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ డే సమావేశంలో ఆయన ప్రసంగించారు. అలాగే నవ జాత శిశు సంరక్షణపై, తల్లి పాలు ప్రాముఖ్యత లాంటివి తల్లులకు చెప్పాలని అన్నారు. ప్రతీ ఆశ కార్యకర్త వద్ద గర్భిణీ కిట్స్ వుండాలని, లేకపోతే వెంటేనే అరోగ్య కేంద్రం లో తీసుకోవాలి అని సూచించారు. ఈ సమావేశంలో మరో వైద్య అధికారి షహనాజ్ సాదియ, సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, పీహెచ్ ఎన్ కృష్ణవేణి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, ఆశ కార్యకర్తలు, ఎ ఎన్ ఎం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా లోకేష్ యువగళం పాదయాత్ర వల్ల ఒరిగిందేమీ లేదు

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

విశాలాంధ్ర - పాయకరావుపేట: నారా లోకేష్ యువగళం పాదయాత్ర వలన దళిత బహుజనులకు ఒరిగిందేమి లేదని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ విమర్శించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలన లోనూ, ప్రస్తుత వైసిపి పాలనలో దళితుల పరిస్థితి పెనం నుండి పొయ్యిలోకి పడినట్లుగా ఉందన్నారు. ఐక్యతగా ఉన్న దళితులను వర్గీకరణ పేరుతో విభజించిన చరిత్ర టీడీపీ ప్రభుత్వందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో టీడీపీ పాలన లో వ్యవసాయం భూములను హేచరీలు, హేటిరో, డెక్కన్ వంటి ప్రమాదమైన రసాయన కెమికల్ కంపెనీ లకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి తీర ప్రాంతంను, వ్యవసాయం భూములను కలుషతం చేసారని ఆరోపించారు. దీనికి అపార్టీల ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో దళితులు సాగుచేసికుంటున్న ఆవ భూములను లాక్కొని ప్రైవేట్ నీటి కంపెనీ లను కట్టబెట్టడంలో లో నారా లోకేష్ పాత్ర ఉన్నదన్నారు. గత బాబూ పాలన లో రాష్ట్ర రాజధాని అమరావతి ని పూర్తి చేయకుండా నరేంద్ర మోడీ, బిజెపి కేంద్ర సర్కార్ తో కుమ్మక్కు అవడం వలన రాజధాని పూర్తి చేయకుండా మధ్యలో వదిలేసారని తెలిపారు. ప్రత్యేక హెూదా అంశాన్ని మోడీ సర్కార్ కు చంద్రబాబు తాకట్టుపెట్టారని విమర్శించారు. ప్రస్తుతం జగన్ మూడు రాజదానుల పేరుతో రాష్ట్రానికి ద్రోహం చేసారని ఆరోపించారు. జగన్, చంద్రబాబు లు ఇద్దరూ అవినీతి కేసుల్లో పీకల లోతికి కూరుకు పోయారన్నారు. రాష్ట్రం లో రెండు శాతం జనాభా లేని కమ్మ. రెడ్డి కులాలు మాత్రమే అధికారం ను చలా ఇస్తున్నాయని, 95 శాతం దళిత బహుజన జాతులకు పొలిటికల్ పవర్ రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేసారు. రానున్న ఎన్నికల్లో దోపిడీ కులాల నాయకత్వం లోని పార్టీ లకు బుద్ధి చెప్పాలని, మెజారిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలే సీఎం పదవిని సాధించికోవాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి. ఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను వర్ధంతి అంటూ అవమానం చేసిన చరిత్ర లోకేష్ దన్నారు. టీడీపీ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ నిధుల అవకతవకలు చేసిన టీడీపీ సర్కార్ లోని మాజీ మంత్రుల ముద్దాయి ల జాబితా లో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్ కాగా, మిగిలిన వారిలో మాజీ మంత్రి నారా లోకేష్ కూడా ఉన్నారని తెలిపారు. టీడీపీ పాలన లో నియోజకవర్గం లో ఎక్కడ అభివృద్ధి జరగ ఈ లేదని విమర్శించారు ఈ రెండు ఆధిపత్య పార్టీ లు దళిత జాతులను మోసం, ద్రోహం చేశాయన్నారు. వీరి నాయకత్వ భ్రమలు నుండి దళిత జాతి బయటకు రాకపోతే భవిష్యత్తు లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా శాఖ అధ్యక్షులు దువ్వాడ దావీదు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిడారి మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు సమ్మె బాట

విశాలాంధ్ర - దుంబ్రిగుడ:- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడి కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఐ సి డి ఎస్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే కొండమ్మ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కే సత్యవతి, జి పవిత్ర, మండలంలోని అంగన్వాడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలంలో మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం వాణిశ్రీ ఆధ్వర్యంలో

మారేడుమిల్లి ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్స్ మినీ కార్యకర్తలు ఆయాలు మారేడుమిల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెలో భాగంగా రాష్ట్రంలో అంగన్వాడి వర్కర్లను సుప్రీంకోర్టు ను అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించి 50 సంవత్సరాలకు వయోపరిమితి పెంచాలని నినాదాలతో హెూరెత్తించారు. పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రసూతి సమయంలో మెడికల్ లీవ్ కేటాయించాలని రిటైర్మెంట్ పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ధర్నా చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి వర్కర్లు మినీ వర్కర్లు ఆయాలు పాల్గొన్నారు.

గంగవరం: తమ సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రమైన గంగవరంలో తహసిల్దార్ తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు

చెల్లించాలని డిమాండ్ చేశారు. 22వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటి చెల్లించాలని, డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ నెరవే నెరవేరలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని, మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్డేట్ చేయాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాడి వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు కే నాగదేవి, కే రాణి, సెక్టార్ నాయకులు కే సోమలమ్మ, టి వీరమణి, శిరీష ,కే నాగమణి కే, వెంకయ్యమ్మ పాల్గొన్నారు.

చింతూరు: చింతూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి ఐటీడీఏ ముందు సీఐటీయూ ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె శిబిరంలో సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిథులుగా పాల్గొని సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మూడు కార్మిక సంఘాలు సీఐటీయూ. ఏఐటీయూసీ. ఐ ఫ్ టీ యూ. సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సమ్మె కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రధాన సమస్యలు కూడిన వినతి పత్రాన్ని ఐటిడిఏ పిఓ అందజేశారు. ఈ సమ్మెకి నాయకులు ఆదివాసి అడ్వకేట్ పాయం రవి వర్మ, గిరిజన

సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్ సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, సిఐటియు మండల కమిటీ సభ్యులు బీరబోయిన దిలీప్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటరమణ, జయ, కామేశ్వరి, చిట్టమ్మ, వసంత, పార్వతి, దుర్గ, ఏఐటీయూసీ నాయకులు రాజకుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జీకేవీధి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీకేవీధిలో మంగళవారం అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన కుటుంబాలకు ఒకరికి ఉద్యోగం, భీమా కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టిఎ బిల్లులు, ఇతర బకాయిలు

చెల్లించాలన్నారు. మెడికల్ లీవ్ సౌకర్యాన్ని కల్పించి రిటర్మెంట్ వయసు 62 సంవత్సరాల పెంచాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరిపడా చేయాలి ప్రీస్కూల్ బలపతం చేయాలన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు ఇవ్వాలన్నారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ అండ్ వెల్ఫేర్ యూనియన్ మండల ప్రాజెక్టు అధ్యక్షులు కార్యదర్శి సోమల అప్పలనర్స, జి.దయామెంటి, ఎస్.భవానీ, చిరంజీవి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మిలు అన్నారు. అంగన్వాడీల డిమాండ్ల సాధనకై యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు,మినీ వర్కర్లు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కె వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడుతూ, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అధికంగా వేతనాలు పెంచాలన్నారు. అంగన్వాడీల నిరసన దీక్షకు డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు టి శ్రీను మద్దతు తెలిపారు, కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు యు రాజేశ్వరి,ఎల్ సత్యవతి,కె లక్ష్మీ,ఎం చిన్నమ్మలు,రమణి, సుందరమ్మ పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92 వ వార్డు 477 సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఏపి.ఎం.ఎస్.ఎంఈ.డిసి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసి ఇందిరా నగర్ లో పార్టీ జెండాను ఎగురవేశారు. జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ముందుగా సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన వివరాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు 92 వ వార్డు అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, బండారు శ్రీనివాసరావు, కడిమి రామకృష్ణ, ఊటపల్లి గోవిందు, సాగర్, శివాజీ, దాసరి శ్రీను, కమలాదేవి, జ్యోతి, జీవి రమణ, జగదీష్, మనోహర్, సురేష్, బాలు పాల్గొన్నారు.

కామయ్యపేట రోడ్డుకు మోక్షం

విశాలాంధ్ర - హుకుంపేట: కామయ్య పేట రోడ్డుకు మోక్షం లభించిందని, గిరిజన గ్రామ అభి వృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎంపిపి కూడా రాజుబాబు, జెడ్పిటీసీ సభ్యుడు రేగం మత్య లింగం అన్నారు. మంగళవారం మండలంలోని దిగుడుపుట్టు జంక్షన్ నుంచి కామయ్యపేట రోడ్డు మట్టు జోరువరకు ఎం జి ఎన్ ఆర్ ఈ జీ ఎస్ నిధులు రూ. 52.75 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు వారు కొబ్బరికాయకొట్టి ప్రారంబించారు. ఈ కార్య క్రమంలో మండల పంచాయతీరాజ్ ఏఈ ఎస్.సంజీవరావు, సర్పంచ్లు సీదరి సాంభ, రంజిత్ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స సక్సెస్

విశాలాంధ్ర - చింతపల్లి: కాలుపై ఏర్పడిన కణితి కారణంగా వచ్చే నొప్పితో సుమారుగా 8 నెలలుగా బాధపడుతున్న గిరి మహిళ విజయ కుమారికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. మొట్టమొదటిగా చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో కాలు పై గల కణితి తొలగించిన స్థానిక వైద్యులకు అరుదైన గౌరవం దక్కింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలో నివసిస్తున్న గృహిణి రీమల విజయ కుమారి (44) ఏరియా ఆసుపత్రి ఆర్థోపెటిక్ వైద్యాధికారి సాయి కుమార్, జనరల్ సర్జన్ వైద్యాధికారి అజయ్ బాబు లు కణితి చికిత్స (ఆపరేషన్) నిర్వహించి తొలగించారు. ఈ కణితి తొలగింపుతో ఆమె ఆరోగ్య పరిస్థితులు మెరుగుగా ఉన్నాయని వైద్య అధికారులు తెలిపారు. కాలు ఆపరేషన్‌కి శ్రమించిన వైద్యాధికారులకు, సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి :- ఆడుదాం ఆంధ్ర క్రీడలకు క్రీడాకారులు, ప్రేక్షకులు త్వరగా పేర్లు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఆశాజ్యోతి అధ్యక్షతన సచివాయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ ఆశక్తి ఉన్న క్రీడాకారులు త్వరగా పేర్లు నమోదు చేసుకోనేలా సచివాలయ సిబ్బంది వాలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఏ టి డబ్ల్యూ ఓ బలిరెడ్డి జయనాగలక్ష్మి, ఎంఈఓ పనసల ప్రసాద్ పాల్గొన్నారు.

సీలేరు డిఎవి పాఠశాలలో బయోమెట్రిక్ విధానం అమలు

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో బుధవారం నుంచి బయోమెట్రిక్ విధానం అమల్లోకి వస్తోందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓం నమ:శివాయ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్‌కు సంబంధించిన పరికరాలను ఏపి జెన్‌కో టెలికమ్యూనికేషన్ సబ్ ఇంజనీర్, సిబ్బంది మంగళవారం ఏర్పాటు చేశారన్నారు. ఇక నుంచి

పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు నాన్ టీచింగ్ సిబ్బంది ఉదయం విధులకు హాజరయ్యేటప్పుడు, సాయంత్రం పాఠశాల విడిచిపెట్టినప్పుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని సూచించారు. ఈ బయోమెట్రిక్ పాఠశాల నుంచి ఏపి జెన్‌కో అకౌంట్స్ సెక్షన్‌కు అనుసంధానం చేయబడిందని, బయోమెట్రిక్ ఆధారంగానే జీతాలు చెల్లించే విధంగా ఏపి జెన్‌కో యాజమాన్యం చర్యలు తీసుకుంటుందన్నారు.